విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో వెలువడుతున్న మన ధ్యాస దినపత్రికలో అన్ని మండలాల వారిగా, అన్ని నియోజకవర్గాల వారిగా, అన్ని జిల్లాల వారిగా విలేకరులు కావలెను
సంప్రదించండి
సెల్ 9494234386

PRGI No : APTEL/25/A4300
MANAA DHYASA
మాకలం బలం కోసం కాదు బలహీనుడి కోసం
# మన ధ్యాస
తెలుగు దినపత్రిక
www.mananews.co.in
ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి | ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ | గురువారం 22-01-2026 | పేజీలు - 8
VOLUME : 1 ISSUE : 55 EDITOR : CHANDRASEKHAR REDDY S PAGES : 8 PRICE:2/-
Published From Krishna,Kadapa,Chittoor,Tirupati,Prakasam,East.Godavari,Ananthapur,Guntur,Nellore,

## విష సంస్కృతికి నిలయంగా ట్రోలింగ్

- ట్రోలింగ్ సంస్కృతి సమాజాన్ని ఎటు తీసుకెళ్తోంది?
- అభిప్రాయానికి బదులు అవమానాలు
- విమర్శ పేరుతో దూషణలు
- డిజిటల్ స్వేచ్ఛా డిజిటల్ దాడియా?




**మన ధ్యాస ప్రత్యేక కథనం :-**
సోషల్ మీడియా ఒకప్పుడు అభిప్రాయాల వ్యక్తీకరణకు వేదికగా ఉండేది. ఆలోచనలు పంచుకునే సాధనంగా, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే మాధ్యమంగా గుర్తింపు పొందింది. కానీ క్రమంగా అదే వేదిక ట్రోలింగ్ అనే విష సంస్కృతికి నిలయంగా మారింది. అభిప్రాయం వ్యక్తం చేస్తే చాలు, వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న మాటలు వెల్లువెత్తుతున్నాయి. ఇది స్వేచ్ఛా భావప్రకటనకు పెద్ద అడ్డంకిగా మారుతోంది. ట్రోలింగ్‌కు గురయ్యేవారిలో రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, కళాకారులు మాత్రమే కాదుడ సామాన్య పౌరులు కూడా ఉన్నారు. ఒక సాధారణ పోస్టు, ఒక నిజాయితీగల ప్రశ్న, ఒక విభిన్న అభిప్రాయం చాలుడ వందలాది కామెంట్లు వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయికి చేరుతున్నాయి. విమర్శకు, దూషణకు మధ్య ఉన్న గీత పూర్తిగా చెరిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ ట్రోలింగ్ సంస్కృతి సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా యువత మానసిక ఆరోగ్యంపై దీని దెబ్బ తీవ్రంగా ఉంది. భయంతో అభిప్రాయం చెప్పకుండా మౌనంగా ఉండే పరిస్థితి ఏర్పడుతోంది. నిజం మాట్లాడితే ట్రోలింగ్‌కు గురవుతామన్న భావన ప్రజల్లో పెరుగుతోంది. ఫలితంగా చర్చ, సంభాషణ, సృజనాత్మక ఆలోచనలకు స్థానం తగ్గిపోతోంది. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదుడ సామాజిక సమస్య. సోషల్ మీడియా వేదికలు, చట్టాలు, సమాజం, మూడు కలిసి బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. విమర్శ సంస్కృతిని ప్రోత్సహించాలి, కానీ అవమానాన్ని కాదు. మాటకు స్వేచ్ఛ అవసరం, కానీ బాధ్యతతో కూడిన స్వేచ్ఛ కావాలి. ట్రోలింగ్‌కు తావివ్వని డిజిటల్ సంస్కృతి ఏర్పడినప్పుడే, సోషల్ మీడియా నిజంగా సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా మారుతుంది.

## భారత్ - స్పెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు

**న్యూఢిల్లీ, మన ధ్యాస :-**
కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బుధవారం ఉదయం స్పెయిన్ విదేశాంగ మంత్రి హోసే మాన్యుయెల్ ఆల్బారెస్తో విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. భారత్ ▪ స్పెయిన్ మధ్య కొనసాగుతున్న సహకారం, ప్రపంచ వ్యవహారాల్లో ఉభయ దేశాల దృష్టికోణాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. రాజకీయ స్థాయిలో కొనసాగుతున్న బలమైన సంభాషణను మరింత పటిష్టం చేయాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. భారత్ ▪ యూరోపియన్ యూనియన్ సంబంధాలను వివిధ రంగాల్లో




లోతుగా తీసుకెళ్లేందుకు స్పెయిన్ అందిస్తున్న మద్దతుకు జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారం భారత్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఇండో ▪ పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లో స్పెయిన్ చేరడాన్ని కేంద్ర మంత్రి జైశంకర్ హర్షంతో స్వాగతించారు. ఈ భాగస్వామ్యం ద్వారా సముద్ర భద్రత, స్థిరమైన అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## దావోస్‌లో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

### డబ్ల్యూఈఎఫ్ తొలి రెండు రోజుల చర్చలపై విశ్లేషణ

**దావోస్, జనవరి 21 : (మన ధ్యాస)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు దావోస్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో తొలి రెండు రోజులుగా జరిగిన చర్చల సారాంశాన్ని ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించారు. తొలి రెండు రోజుల సమావేశాల్లో అంతర్జాతీయ ప్రతినిధి బృందాలు వ్యక్తం చేసిన కీలక ఆసక్తి రంగాలు, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, పరిశ్రమల భాగస్వామ్యాలపై వచ్చిన ప్రతిపాదనలను సీఎం సమీక్షించారు. రాష్ట్రానికి



లాభదాయకంగా మారే అవకాశాలు, రంగాలవారీగా ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ ప్రతినిధులతో నిరంతర సమన్వయం కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించడంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే గుర్తించిన ప్రాజెక్టులపై ఫాలోఅప్ చర్యలు వేగవంతం చేయాలని, చర్చలు ఒప్పందాల దశకు చేరేలా స్పష్టమైన టైమ్‌లైన్‌తో పని చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. డబ్ల్యూఈఎఫ్ వేదికపై రాష్ట్రానికి లభించిన అవకాశాలను కార్యరూపంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

## సిద్ధగంగ మఠంలో శివకుమార మహాస్వాముల స్మరణ సభ

**తుమకూరు,మన ధ్యాస, జనవరి 21 :-**
భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కర్ణాటక రాష్ట్రం తుమకూరులోని శ్రీ సిద్ధగంగ మఠంలో నిర్వహించిన డాక్టర్ శ్రీ శ్రీ శివకుమార మహాస్వాముల 7వ స్మరణ దిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాస్వాములను కరుణ, నిస్వార్థ సేవకు దీపస్తంభంలా నిలిచిన మహనీయుడిగా స్మరిస్తూ ఘన నివాళులు అర్పించారు. సేవనే సాధనగా, మానవత్వాన్నే అత్యున్నత ఆరాధనగా భావించిన శివకుమార మహాస్వాముల తత్వాన్ని ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. సిద్ధగంగ మఠం తరతరాలుగా కొనసాగిస్తున్న సేవ, విద్య, కరుణ పరంపర సమాజానికి




ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడంలో ఈ మఠం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, కేంద్ర రైల్వేలు ▪ జలశక్తి శాఖ సహాయ మంత్రి వి సోమన్న, కర్ణాటక హోంమంత్రి జి పరమేశ్వర, సిద్ధగంగ మఠం అధ్యక్షుడు శ్రీ శ్రీ సిద్ధలింగ మహాస్వాములుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహాస్వాముల బోధనలు, సేవా మార్గం నేటి తరాలకు మార్గదర్శకమని వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తుల కేంద్రం

**దావోస్, జనవరి 21 : (మన ధ్యాస) :-**
అమెరికాకు చెందిన సర్గాడ్ సంస్థ తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడు నుంచి ఐదు సంవత్సరాల్లో దశలవారీగా వెయ్యి కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగానికి కొత్త ఊపు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా దావోస్‌లో సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు పక్షాలు



పెట్టుబడులు, మౌలిక వసతులు, భవిష్యత్ అవకాశాలపై విస్తృతంగా చర్చించి ఒప్పందానికి వచ్చాయి. ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, ఆధునిక తయారీ రంగాల్లో సర్గాడ్ సంస్థకు ఉన్న అనుభవాన్ని తెలంగాణలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను మూడు ప్రత్యేక అభివృద్ధి ప్రాంతాలుగా రూపొందిస్తున్నట్లు వివరించారు. సేవల రంగానికి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, తయారీ రంగానికి పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, వ్యవసాయం మరియు గ్రీన్ ఎకానమీకి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ విధానంతో సమతుల్యమైన ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట విమానాల నిర్వహణ ▪ మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని సర్గాడ్ సంస్థకు హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుతో తెలంగాణలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మన ధ్యాస

ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి    ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ    గురువారం 22-01-2026




## దావోస్‌లో జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్‌తో మంత్రి లోకేష్ భేటీ

**దావోస్, జనవరి 21 : (మన ధ్యాస)**

ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో సమావేశమయ్యారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ రంగ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అల్గోరిథంలు, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ పరిశోధన ▪ అభివృద్ధి రంగాలపై దృష్టి సారిస్తూ విశాఖపట్నంలో ఒక ఆధునిక టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని జెరోధా ఫౌండర్‌ను కోరారు. విశాఖ నగరానికి ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ ఈ రంగానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఫిన్‌టెక్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, అధిక విలువ కలిగిన ఉ



ద్యోగావకాశాల సృష్టే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, వేగవంతమైన నిర్ణయాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ పెట్టుబడులకు కొత్త దారులు తెరుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. 'ఆంధ్రా ఇజ్ బ్యాక్' నినాదంతో రాష్ట్రాన్ని పెట్టుబడులకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ భేటీ మరోసారి స్పష్టం చేసింది.

## బాల్యాన్ని కాపాడుకుందాం – భవిష్యత్తును నిర్మిద్దాం

### గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో 'ప్రగతి' సంస్థ చైతన్య యాత్ర.-తిరుపతి జిల్లాలో 'బాల్య వివాహ విముక్తి రథం' ప్రారంభం.

**రేణిగుంట మన ద్యాస జనవరి 21.**

బాల్య వివాహా విముక్తి రథం ప్రారంభ కార్యక్రమానికి మద్దతు!! భారత ప్రభుత్వము మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కలసి ప్రారంభించిన 100 రోజుల ఇంటెన్సివ్ క్యాంపెయిన్లో భాగంగా, బాల్య వివాహ రహిత భారతదేశాన్ని తీర్చిదిద్దే మహత్తర లక్ష్యంతో, తిరుపతి జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల లో బాల్య వివాహాల అధిక ప్రబలత ఉన్న గ్రామాలకు చేరుకొని, తీవ్రంగా మరియు కాలపరిమితితో కూడిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రగతి సంస్థ ''బాల్య వివాహాల విముక్తి రథం కార్యక్రమాన్ని ప్రారంభించుడమైనది.

తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి రేణిగుంట సీఐ జయచంద్ర , ఎస్సై ధర్మారెడ్డి ,యం ఈ.ఓ. రంగనాదం, డిప్యూటీ తహసిల్దార్, రేణిగుంట సర్పంచ్ నగేష్, గుత్తువారిపల్లి సర్పంచ్



మంజుల సంతకాలు పెట్టి వారి యొక్క మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళుతున్నటువంటి ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను ఉద్దేశించి సిఐ జయచంద్ర మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పైన జరుగుతున్న అఘాయిత్యాలలో బాల్య వివాహమనేది ఒకటి. బాల్య వివాహాల వలన పిల్లల యొక్క బాల్యాన్ని కోల్పోవడమే కాకుండా వారి జీవితంలో మానసిక ఒత్తిడిలకు లోనువుతారన్నారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థల ద్వారా జరుగుతున్నటువంటి ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల ప్రజల్లో మరియు పిల్లలలో కూడా బాల్య వివాహాల పైన అవగాహన పెరిగి జరగబోయే రోజుల్లో బాల్య వివాహాలు లేకుండా చేయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఆపడానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన వారి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ, జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి, జయలక్ష్మి కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ కోటయ్య, లత మరియు ఇతరలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు సాదర వీడ్కోలు

**కడప,జనవరి 21: (మన ధ్యాస):-**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా లో ఒకరోజు పర్యటన ను ముగించుకొని బుధవారం స్టేట్ గెస్ట్ హౌస్ నుండి తిరుపతి కి బయలు దేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సాదర వీడ్కోలు పలికారు. స్టేట్ గెస్ట్ హౌస్ నందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన తిరుపతికి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మడకశిర వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో వైయస్ జగన్ భేటీ

**తాడేపల్లి,మన ధ్యాస, జనవరి 21 :-**

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ను శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిశారు. స్థానిక పాలనలో ఎదురవుతున్న అంశాలు, ప్రజల సమస్యలు, పార్టీ కార్యక్రమాల అమలుపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ భేటీలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, మడకశిర వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ ఈర లక్కప్పతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు చేరువగా పార్టీ కార్యక్రమాలు అమలయ్యేలా సమన్వయంతో పనిచేయాలని నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ కేడర్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం



కొనసాగించడం అవసరమని నేతలు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ కార్యాచరణను మరింత చురుగ్గా కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి రక్ష

**కడప జనవరి 21:(మన ధ్యాస )**

తమ జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి రక్షణ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్ డి విజయ జ్యోతి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ ఆద్వర్యంలో విజయ జ్యోతి సమక్షంలో నగరంలోని (31 వ డివిజన్) గుర్రాల గడ్డ వీధిలో 150 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరాయి, ఆమె అందరిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విజయ జ్యోతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆద్వర్యంలో నడుస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను కులం, మతం పేరుతో విడదీసి విచ్చిన్నం చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి ఓటు





మాత్రమే ప్రజల ఆయుధమని దాంతోనే గద్దె దించేందుకు నడుంబిగించాలని పిలుపు నిచ్చారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో పేద బడుగు వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు లోని గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమని ఆరోపించారు. ఇప్పటికే దేశ ప్రజలు నరేంద్ర మోడీ నయవంచన కుట్రలను గమనించి కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నట్లు చెప్పారు. రాష్ట అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రేస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. యువనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు అనం తరం నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ కడప లోని టిడిపి, వైసిపి నుంచి భారీగా వలసలు మొదల య్యాయని చెప్పారు. వై ఎస్ ఆర్ సి పి,టి డి పి ఇరు ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. దీంతో ప్రజలు తిరిగి సొంత గూటికి చేరుతున్నట్లు చెప్పారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప లోని 50 డివిజన్లలో పోటీ చేసి 30 డివిజన్లు గెలిచి మేయర్ పదవిని కైవసం చేసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ చేరిన వారిలో సాదిక్ సౌదాగర్, మున్నీర్ భాషా, ఖదీర్ భాషా, జిన్నా,మురాద్ భాషా, చరణ్, తిప్పన్న,భాస్కర్,రషీమున్నీ,నషీమ్ తదితరులు ఉన్నారు

## ఇసుక రీచులు, స్టాక్ పాయింట్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి -జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప జనవరి 21: (మన ధ్యాస)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని, ఇసుక రీచులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత, నూతన ఇసుక రీచ్ ల గుర్తింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా లతో కలసి జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డిఎల్ఎస్ సి) సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్






చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధా నంలో ఎలాంటి సమస్యలు తలెత్త కుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. నూతన ఉచిత ఇసుక పాలసీ ప్రకారం ఉచిత ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని, స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుక రేట్స్ ను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలోని అన్ని ఇసుక రీచులను పరిశీలంచాలని ఆర్డీవోల ను ఆయన ఆదేశించారు. అక్కడ డీసిల్టేషన్ పాయింట్లు, కొత్త ఇసుక రీచుల ప్రతిపాదనలు, గుర్తింపు, సీసీ కెమెరాల పనితీరు మొదలైన అంశాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డిడి సుబ్ర మణ్యం, రీజినల్ ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు, భూగర్భ గనులశాఖ, పిసీబీ శాఖ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతతోనే మహిళా సంఘాల బలోపేతం. ఎంపీడీవో కర్రీ ధర్మారావు

**జియ్యమ్మవలస/మనధ్యాస/ జనవరి 21:-**

మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఈ-నారి అలాగే సీఆర్పీ లకు నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఏపీఎం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కర్రీ ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మహిళా సంఘాల ప్రతినిధులు, వీవోఏలు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. సంఘాల్లో పొదుపు మరియు రుణాల నిర్వహణపై ఆయన పలు కీలక సూచనలు చేశారు: ప్రతి నెలా పొదుపు మొత్తాన్ని కేవలం అవసరమైన వారు మాత్రమే వాడుకునేలా చూడాలి. వడ్డీ రేట్ల నిర్ణయంపై స్పష్టమైన బైలా నిబంధనలు రూపొందించుకోవాలి. వసూలైన వడ్డీలను



పొదుపు ఖాతాల్లో భద్రపరచాలని, ఆ మొత్తాన్ని అవసరమైన సభ్యులకు రుణాలుగా ఇచ్చి, వడ్డీతో సహా సకాలంలో తిరిగి చెల్లించేలా టర్నోవర్ పెంచాలని ఉదాహరణలతో వివరించారు. ఆర్థికాంశాలతో పాటు గ్రామాల అభివృద్ధిలో ఈ-నారీలు విశేష కృషి చేయాలని ఎంపీడీవో ఉద్బోధించారు. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై గ్రూపులన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇంటి ముస్తాబుతో పాటు వీధి ముస్తాబు వీధుల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. తాగునీటి వనరుల నిర్వహణ, ప్రతి శుక్రవారం 'ఫ్రైడే – డ్రై డే' పాటించడం ద్వారా వ్యాధుల నివారణకు కృషి చేయాలి. తడి-పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలి. మండలంలో బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నిర్మూలించేలా మహిళా సంఘాలు చొరవ చూపాలి. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది, ఈ-నారీలు అలాగే సీఆర్పీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మన న్యూస్ మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

మన న్యూస్ మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

మన న్యూస్ మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

# మన ధ్యాస

ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి    ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ    గురువారం 22-01-2026




## కూటమి ప్రభుత్వంలో రైతులే రాజులు

## 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ.

### ఆర్.బి.కె ద్వారా రైతులకు యూరియా ఇవ్వడం జరుగుతుంది.-కొమరాడ మండల తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను.

**జియ్యమ్మవలస/కొమరాడ/ మనధ్యాస/జనవరి 21**

హొరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారిని నిజమైన రాజులుగా మారుస్తోందని కొమరాడ మండల తెలుగు రైతు అధ్యక్షుడు బత్తిలి శ్రీను కొనియాడారు. బుధవారం కొమరాడ మండలంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలోని ముఖ్యాంశాలను వెల్లడించారు:వేగవంతమైన చెల్లింపులు:హొగతంలో ధాన్యం అమ్ముకున్న తర్వాత డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, కానీ నేడు ముఖ్యమంత్రిహొనారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిహొపవన్ కళ్యాణ్హొకృషితో ధాన్యం కొనుగోలు చేసినహొ24 గంటల్లోనేహొనేరుగా రైతు



ఖాతాల్లో నగదు జమ అవుతోందని తెలిపారు.భూ సర్వే - పాస్ బుక్కులు:హొనిలిచిపోయిన భూముల రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, తప్పుల్లేని పాస్ బుక్కులను రైతులకు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు.సాగు పనులకు ఆటంకం కలగకుండా రెండో విడత యూరియాను రైతు భరోసా కేంద్రాల ద్వారా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.కురుపాం మ్మెల్యేహొతోయక జగదీశ్వరిహొనేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని బత్తిలి శ్రీను తెలిపారు. ముఖ్యంగా కొమరాడ మండలంలో రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని.అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కార్యకర్తలు అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి- సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్, జిల్లా కార్యదర్శితోట జీవన్న

**జియ్యమ్మవలస/మనధ్యాస/ జనవరి 21**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని అలాగే పని హక్కును కాపాడాలని సిపిఐ ఎమ్ఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోటజీవన్న డిమాండ్ చేశారు,అలాగే కార్మిక చట్టం రాష్ట్రానికి భారం కార్పొరేట్లకు లాభశీ కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాబట్టి జనవరి నెల నుండి వరకు జియమ్మవలస మండలములోని అర్నాడు పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త వలస గ్రామములో ఇంటింటి ప్రచారం చేయడమైనది, ఈ సందర్భంగా మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం కమ్యూనిస్ట్ పార్టీల పోరాటఫలితంగా 2005 వసంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం ప్రారంభించడం జరిగిందని అయితే ఇలాంటి సందర్భంలో ఈరోజు కేంద్ర ప్రభుత్వంలో గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2025 వ సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసి వి బి జి రాంజీ స్కీమ్ తేవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పేద రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఉందని దీనివల్ల పని హక్కు కోల్పోతున్నారని ఈ పథకం అమల వల్ల వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ లేదని ఈ చట్టం వల్ల కార్పొరేట్లకు లాభం వ్యవసాయ కూలీలకు నష్టం జరిగే పరిస్థితి ఉందని, కార్పొరేట్ వర్గాలు సౌకర్యాల కోసం శ్రమ కోసం వేతనాలు తగ్గింపు కోసం లేబర్ కోడ్ లను తెచ్చారని, గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెంచాలనే ఉద్దేశం తో ఉపాధి



చట్టం మార్చాలని కార్పొరేట్ల ఒత్తిడి మేరకే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేయడం జరిగిందని ఇలాంటి సందర్భంలో ఎక్కువ మంది లేబర్ ఉంటే తక్కువ వేతనాలతో పని చేయించుకొని ఆర్థిక లాభం పొందవచ్చు నన్నది కార్పొరేట్ల దూరాలోచనకి ఇది ఉదాహరణని,ఇలాంటి సందర్భంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పథకమును నిర్వీరం చేస్తూ వస్తున్నారని, 2021లో ఈ పథకానికి సంబంధించి లక్ష 11 వేలు కోట్ల రూపాయలు కేటాయించగా 2024 సంవత్సరంలో 2025వ సంవత్సరంలో కేవలం 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని ఇలాంటి సందర్భంలో పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు కేటాయించలేదని కానీ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అప్పగిస్తున్నారని అన్నారు, కాబట్టి ఇలాంటి సందర్భంలో పేదలకు వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని 2005 వసంవత్సరం లో గ్రామీణ ఉపాధి పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తే రాష్ట్రాలు పది శాతం నిధులు భరించే పరిస్థితి ఉందని ఇలాంటి సందర్భంలో కేంద్రం కొత్త చట్టాన్ని తెచ్చిన తర్వాత కేంద్రం 60% రాష్ట్రం 40% నిధులు భరించవలసిన పరిస్థితి వస్తుందని అన్నారు,ఇలాంటి సందర్భంలో ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు కేటాయించ లేవు అంతేకాక రాష్ట్రాలు ఖర్చు పెట్టాక కేంద్రం నిధులు ఇస్తాదని ఆ విధంగా ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతో నే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందని కాబట్టి ఇటువంటి పథకాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం జనసేన వైసిపి పార్టీలు ఆమోదించటం సిగ్గుచేటని కాబట్టి ఈ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు,అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం కోసం సిపిఐ ఎమ్ ఎల్,రెడ్ స్టార్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ రోజు అనగా బుధవారం తెలిపిన గ్రామాల్లో ఇంటింటి ప్రచారం జరిగిన నేపథ్యంలో ఉపాధి కూలీలందరూ పెద్ద ఎత్తున ఈ క్యాంపియన్ లో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఉపాధి కూలీలకి కోరుచున్నాము ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బిడ్డిక రమణ మూర్తి, ఉపాధి హామీ కూలీలు రమేష్, నాగ, ఉమా పాల్గొన్నారు.

## దివంగత టీడీపీ నాయకుడు రామ్మూర్తి రెడ్డి కి తుడా ఛైర్మన్ నివాళులు

### కుంట్రపాకంలో రామ్మూర్తి రెడ్డి 11వ నెల విస్తర కార్యక్రమం- పాల్గొన్న డాలర్స్ దివాకర్ రెడ్డి

**రేణిగుంట మన ద్యాస జనవరి 21:-**

తెదేపా నాయకుడు రామ్మూర్తి రెడ్డి 11వ నెల విస్తర కార్యక్రమం తిరుపతి రూరల్ కుంట్రపాకంలో జరిగింది.ఈ కార్యక్రమానికి తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెదేపా



నాయకుడు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు,బంధు మిత్రులు పాల్గొన్నారు.

## “రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్.

### పట్టాదారులకు కొత్త పాస్‌పుస్తకాలు అందజేసిన తహశీల్దార్“చంద్రశేఖర్ రెడ్డి.

**రేణిగుంట,మన ద్యాస జనవరి21:-**

మండల పరిధిలోని తాతయ్య కాల్వ గ్రామంలో రైతులకు రీ-సర్వే పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే ప్రక్రియ ముగిసిన అనంతరం, ఖచ్చితమైన కొలతలతో కూడిన కొత్త పాస్‌పుస్తకాలను రైతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని రైతులకు స్వయంగా పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ-సర్వే ద్వారా భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత వస్తుందని పేర్కొన్నారు. గతంలో ఉన్న భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి మరియు భూ



యజమానులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడానికి ఈ సర్వే ఎంతో దోహదపడుతుందని ఆయన వివరించారు.ఁరీ-సర్వే వల్ల భూ వివరాల్లో స్పష్టత రావడమే కాకుండా, భవిష్యత్తులో భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగవని అధికారులు తెలిపారు. పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు, వాటిలోని తమ పేరు, విస్తీర్ణం మరియు ఇతర వివరాలను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమకు పక్కాగా సర్వే చేసిన పాస్‌పుస్తకాలు అందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## నో వర్క్.. నో పే’ విధానం చట్టసభల్లో అమలుకావాలి

**అమరావతి, మన ధ్యాస :-**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో కూడా ‘నో వర్క్.. నో పే’ విధానం అమలులోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు శాసనసభకు హాజరుకాకుండానే వేతనాలు తీసుకుంటున్నారని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఉద్యోగులు విధులకు రాకపోతే వేతనాలు నిలిపివేస్తారని గుర్తు చేస్తూ, ఎమ్మెల్యేల విషయంలో మాత్రం ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు.ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై మరింతగా ఉండాలన్నారు. శాసనసభ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై చర్చల్లో పాల్గొనడం ఎమ్మెల్యేల కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ‘నో వర్క్.. నో పే’ విధానానికి అనుగుణంగా చట్టం రూపొందించే అంశంపై అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.



ఈ విధానం అమలైతే శాసనసభల పనితీరు మెరుగుపడడంతో పాటు ప్రజల నమ్మకం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 ఏళ్లు

**తిరుపతి,మన ధ్యాస, జనవరి 21 :-**

పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తుపై తిరుపతిలో కీలక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో, రాయలసీమ అధ్యయనాలు సంస్థ అధ్యక్షుడు భూమన సుబ్రమణ్యం రెడ్డి నిర్వహించారు.ఈ చర్చా కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సీపీఎం నేత కందారపు మురళి, మాజీ ఎమ్మెల్సీ యండమూరి శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ, శ్రీశైలం రిజర్వాయర్‌కి 302 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, పూడిక కారణంగా అది ప్రస్తుతం 202 టీఎంసీలకు పడిపోయిందన్నారు. కృష్ణా నదిలో రాయలసీమకు హక్కులే లేవన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 885 అడుగుల వద్ద నీరు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు సరిపడ నీరు వచ్చే అవకాశం ఉంటుందని, కానీ జీవో 69 ద్వారా 834 అడుగుల పరిమితి పెట్టి రాయలసీమను నష్టపరిచారని ఆరోపించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి 854 అడుగులకు జీవో తీసుకువచ్చారని, ఆ తర్వాత రాజకీయాల కారణంగా దాన్ని నిలిపివేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 800 అడుగుల వద్దనే కృష్ణా జలాలను తరలించుకుంటున్నదని, అదే సమయంలో రాయలసీమకు మాత్రం నీరు ఇవ్వడం లేదని అన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి సుమారు రూ.7 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేశారని చెప్పారు. జీవో 69 రద్దు కావాలంటే తెలంగాణ రాష్ట్ర అనుమతి అవసరమని, ఈ విషయంలో చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి రాయలసీమకు




న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో బీజేపీ పూర్తిగా మౌనం వహిస్తోందని విమర్శించారు. తాగునీటి అవసరాల కోసమే ఈ పథకం అత్యవసరమని, జగన్ హయాంలో 2023లో రూ.3,285 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించి వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని నిలిపివేయడం రాయలసీమ ప్రజలకు తాగునీరు లేకుండా చేయడమేనని ఆరోపించారు. ఈ ఉద్యమంలో సీపీఎం పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని స్పష్టం చేశారు.తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, రాయలసీమలో నీరు, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లనే లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సి వచ్చిందన్నారు. నిజమైన విజనరీలు వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైయస్ జగన్ మోహన్ రెడ్డేనని చెప్పారు. రాయలసీమ మీదుగా ప్రవహించే నదిపై హక్కులు లేకుండా



చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని తెలిపారు.ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ, వైయస్ కుటుంబమే రాయలసీమకు అత్యధిక మేలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం, తెలంగాణ ▪ఏపీ సీఎంల రాజకీయ లబ్ధి కోసం రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రజా ఉద్యమం తప్పనిసరి అని పిలుపునిచ్చారు. మొత్తంగా ఈ చర్చా కార్యక్రమం రాయలసీమ ఎత్తిపోతల పథకం కేవలం అభివృద్ధి అంశం కాదని, ప్రాంత ప్రజల జీవన హక్కుల ప్రశ్నగా మారిందని వక్తలు స్పష్టం చేశారు. రాయలసీమకు న్యాయమైన నీటి వాటా సాధించే వరకు ఉద్యమం కొనసాగాలని ఈ వేదిక నుంచి బలమైన సంకల్పం వ్యక్తమైంది.

# మన సినిమా
తెలుగు సినిమా ముచ్చట్లు

ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి | + 91 9494234386 | www.mananews.co.in | 22 - 01 - 2026


## బలగం' తర్వాత వేణు సంచలనం..!

**మన సినిమా :-**

తెలుగు సినీ రంగంలో 'బలగం' చిత్రంతో ఒక్కసారిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన దర్శకుడు వేణు దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత తన రెండో చిత్రంగా 'ఎల్లమ్మ'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార దృశ్యాలు విడుదల కావడంతో కథాంశంపై ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలో భక్తిశ్రద్ధలతో పూజించే ఎల్లమ్మ దేవత చుట్టూ కథ సాగనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తొలిసారిగా ప్రధాన పాత్రలో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. దర్శకుడు వేణు సుమారు 8 గంటల పాటు కథను వివరించగా, అందులోని భావోద్వేగం, తెలంగాణ సెంటిమెంట్ దేవిశ్రీప్రసాద్‌ను బాగా ఆకట్టుకున్నట్లు సమాచారం. చిత్రంలో ఆయన 'పర్శి' అనే మాస్ పాత్రలో




కనిపించనుండగా, లుక్ మరియు సంభాషణలు ప్రేక్షకులను ఆకర్షించేలా రూపొందినట్లు తెలుస్తోంది.ఇంకో ఆసక్తికర అంశం ఏమిటంటే ఈ చిత్రంలో సాధారణ కథానాయిక పాత్ర ఉండదట. మొత్తం కథ ఎల్లమ్మ దేవత చుట్టూనే తిరిగేలా రూపొందించారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవత పాత్ర కోసం ప్రముఖ నటి కీర్తి సురేష్‌ను సంప్రదించినట్లు చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆమె అంగీకారం లభిస్తే దేవత పాత్రలో ఆమె, భక్తుడి పాత్రలో దేవిశ్రీప్రసాద్ కనిపించే అవకాశం ఉందని సమాచారం. 'బలగం'లో గ్రామీణ వాతావరణం, తెలంగాణ సంస్కృతి, భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించిన వేణు, ఈసారి భక్తి, మాస్ భావోద్వేగాలు, సామాజిక అంశాలను మేళవించి 'ఎల్లమ్మ'ను రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందిస్తుందని సినీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ఓటీటీలోకి ఆది సాయికుమార్ శంబాల.. ఎక్కడ చూడాలో తెలుసా..!

**మన సినిమా :-**

టాలీవుడ్ యువ హీరో ఆది సాయికుమార్ గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఎన్నో ప్రయోగాలు చేసినా ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయిన ఆది చివరికి శంబాల సినిమాతో తనకు కావాల్సిన బ్రేక్‌ను అందుకున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భక్తి భావనతో కూడిన మిస్టరీ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంది. దర్శకుడు యుగంధర్ ముని తెరకెక్కించిన ఈ సినిమా సంప్రదాయ భక్తి సెంటిమెంట్‌కు సస్పెన్స్ నిండిన కథనాన్ని మేళవించి రూపొందించారు.

థియేటర్లలో పెద్దగా హడావిడి లేకుండా విడుదలైనప్పటికీ కంటెంట్ పరంగా మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా మల్టీప్లెక్స్ ప్రేక్షకులు, థ్రిల్లర్ సినిమాలు ఇష్టపడే వారు ఈ చిత్రాన్ని ఆదరించారు. కథలోని మిస్టరీ అంశాలు, భక్తి టచ్, ఆది సాయికుమార్



నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.ఇక తాజాగా ఈ సినిమా డిజిటల్ వేదికలోకి అడుగుపెట్టింది. శంబాల డిజిటల్ హక్కులను ప్రముఖ తెలుగు వేదిక ఆహా సొంతం చేసుకుంది. ఈ రోజు నుంచే ఈ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రత్యేక నిబంధనతో విడుదల చేశారు. ప్రస్తుతం శంబాల సినిమాను ఆహా బంగారు సభ్యులు మాత్రమే వీక్షించే అవకాశం ఉంది. సాధారణ సభ్యులకు మాత్రం రేపటి నుంచి ఈ సినిమా అందుబాటులోకి రానుంది. దీంతో బంగారు సభ్యులకు ఒకరోజు ముందుగానే ఈ థ్రిల్లర్‌ను చూసే ప్రత్యేక అవకాశం లభించింది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులకు, అలాగే భక్తి మిస్టరీ కథలను ఇష్టపడేవారికి శంబాల మంచి ఎంపికగా నిలవనుంది. ఆది సాయికుమార్ కెరీర్‌లో కీలకమైన సినిమాగా నిలిచిన ఈ చిత్రం డిజిటల్ వేదికలో ఎలాంటి స్పందన తెచ్చుకుంటుందో చూడాలి.

## ధురంధర్ 2' టీజర్‌కు ఏ సర్టిఫికేట్.. బోర్డర్ 2తో రాబోతున్న రణవీర్ సింగ్..!

**మన సినిమా :-**

రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన బాలీవుడ్ బ్లాక్ బస్టర్ ధురంధర్ సినిమాకు సీక్వెల్‌గా ధురంధర్ 2 తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుండగా, తాజాగా ఈ సినిమా టీజర్‌కు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. సెన్సార్ బోర్డు ఈ టీజర్‌కు ఏ సర్టిఫికేట్ జారీ చేసినట్లు సమాచారం. దీని వల్ల సినిమాలో యాక్షన్, హింసాత్మక దృశ్యాలు భారీ స్థాయిలో ఉండనున్నాయన్న అంచనాలు అభిమానుల్లో పెరుగుతున్నాయి. ఈ సీక్వెల్‌కు ధురంధర్ 2 ది రివెంజ్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సెన్సార్ ధృవీకరణ ద్వారా స్పష్టత వచ్చింది. 1 నిమిషం 48 సెకన్ల నిడివి ఉన్న ఈ టీజర్‌ను జనవరి 23న విడుదల కానున్న బోర్డర్ 2 సినిమాతో పాటు థియేటర్లలో ప్రదర్శించనున్నారు. దీంతో ఒక్కసారిగా ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు ఆదిత్య ధర్ ఈ రెండో భాగాన్ని



కూడా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించినట్లు సమాచారం. మొదటి భాగం చివర్లో వచ్చే ఎండ్ క్రెడిట్ సన్నివేశాలను తిరిగి సవరించి ఈ టీజర్‌గా రూపొందించినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్ మాధవన్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్, రాకేష్ బేడీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ధురంధర్ 2 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. అదే సమయంలో మరో భారీ చిత్రం కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఏర్పడే అవకాశం ఉంది. కేవలం టీజర్‌కే ఏ సర్టిఫికేట్ రావడంతో సినిమా స్థాయి ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తి సినీ అభిమానుల్లో పెరుగుతోంది.

## సూపర్‌స్టార్స్‌తో ఛాన్సులు.. నెగటివ్ ప్రచారాల వెనుక కుట్రలు..! నిధి అగర్వాల్ షాకింగ్ మాటలు!!

**మన సినిమా :-**

తన కెరీర్‌లో వరుసగా ఇద్దరు అగ్ర నటులతో కలిసి నటించే అవకాశాలు రావడంతో హీరోయిన్ నిధి అగర్వాల్ మంచి ఉత్సాహంలో ఉంది. గత ఏడాది పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు చిత్రంలో నటించిన నిధి, ఈ సంక్రాంతికి ప్రభాస్‌తో కలిసి రాజా సాబ్ సినిమాలో కనిపించింది. ఈ రెండు సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా తన కెరీర్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం లేదని నిధి స్పష్టంగా చెప్పింది. పవన్ కళ్యాణ్ చిత్రంలో అవకాశం రావడం తన జీవితంలో కీలక మలుపుగా మారిందని పేర్కొంది. రాజకీయ బిజీ షెడ్యూల్ కారణంగా హరిహర వీరమల్లు షూటింగ్ ఆలస్యం అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడి సినిమా పూర్తి చేశారని నిధి వెల్లడించింది. ప్రచార కార్యక్రమాల బాధ్యతను తానే ఎక్కువగా నిర్వహించానని తెలిపింది. ఆ క్రమంలో పవన్ కళ్యాణ్ నుంచి ప్రశంసలు కూడా అందాయని చెప్పింది. అనంతరం ప్రభాస్‌తో చేసిన సినిమా పెద్ద విజయం



సాధించకపోయినా తన నటనకు మంచి గుర్తింపు వచ్చిందని వివరించింది. ప్రచార కార్యక్రమాల సమయంలో ఒక మాల్‌లో జరిగిన ఘటన తనను కలచివేసిందని నిధి తెలిపింది. అభిమానులు చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించడంతో భద్రతా సిబ్బంది సహాయంతో బయటకు వచ్చినట్లు చెప్పింది. ఈ ఘటన తీవ్ర వివాదంగా మారిందని గుర్తు చేసింది. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నిధి సినీ పరిశ్రమలో జరుగుతున్న నెగటివ్ ప్రచారాలపై స్పందించింది. కొందరు కావాలని పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించింది. నటీనటులు చాలా భావోద్వేగంగా ఉంటారని, ఇలాంటి ప్రచారాలు వారి కుటుంబాలను కూడా బాధపెడతాయని చెప్పింది. తాము సమాధానం చెప్పాల్సింది తల్లిదండ్రులకు మాత్రమేనని స్పష్టం చేసింది. తనపై కూడా ఒకటి రెండు సార్లు ఇలాంటి ప్రచారాలు జరిగాయని, కానీ ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపింది. కాశీకి వెళ్లి వచ్చిన తర్వాత ఆధ్యాత్మికంగా బలంగా మారానని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తి వచ్చిందని నిధి వెల్లడించింది.

## యుద్ధానికి సిద్ధం సన్నీ డియోల్, వరుణ్ ధావన్– దేశభక్తితో ఉర్రూతలూగిస్తున్న కొత్త ట్రైలర్..!!

**మన సినిమా :-**

సన్నీ డియోల్, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన యుద్ధ కథా చిత్రం బోర్డర్ 2 రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తాజాగా 'భూమి వీరులు' అనే పేరుతో కొత్త ట్రైలర్‌ను విడుదల చేసింది. భారత సైనికుల అసమాన త్యాగాలు, దేశభక్తి భావోద్వేగాలను కళ్లకు కట్టేలా చూపిస్తూ ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సంగీత దర్శకుడు మిథూన్ స్వరాలు, సోనూ నిగమ్ గానం, మనోజ్ ముంతాషిర్ రచించిన పాటల పదాలు ట్రైలర్‌కు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి.

1971 భారత్ పాక్ యుద్ధ నేపథ్యంతో సాగే ఈ భారీ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి సైన్యం, వైమానిక దళం, నౌకాదళానికి




చెందిన వీర సైనికులుగా కనిపించనున్నారు. నిజ జీవిత యుద్ధ వీరులైన మేజర్ హోషియార్ సింగ్ దహియా, ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ సాహసాలను ఈ చిత్రంలో అద్భుతంగా ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జనవరి 23న థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. టికెట్ విక్రయాలు ప్రారంభమైన తొలి 48 గంటల్లోనే పెద్ద సంఖ్యలో టికెట్లు అమ్ముడుపోవడం సినిమా క్రేజ్‌కు నిదర్శనంగా మారింది. దేశభక్తి, త్యాగం, వీరత్వాన్ని మరోసారి వెండితెరపై ఘనంగా చూపించనున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఉత్కంఠను మరింత పెంచుతోంది.





Printed,Published and Owned by Chandrasekhar. S, Published at Chitti Nagar, Near Post Office, Vijayawada, Krishna Dt, Andhra Pradesh - 520001. and Printed at M/s Vasantha Sreenivasula Reddy, VSAR Publications D. NO. 41/1077, Sankarapuram, Kadapa, Y.S.R., Andhra Pradesh - 516002. Chief Editor : Chandrasekhar.S, email:mananews89@gmail.com, Cell:9494234386, RNI(PRGI) No: APTEL/25/A4300